

షాద్‌నగర్ ఆర్టీసీ డిపో ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు డీఎం ఉష తెలిపారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా న్యాయవాది సబియాసుల్తానా హాజరై కేక్‌కట్ చేశారు. అనంతరం మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**- షాద్‌నగర్‌టౌన్, మార్చి 8**

## పంచాయతీలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు



కేశంపేట, మార్చి 8: కేశంపేట గ్రామ పంచాయతీ ఆవరణలో కార్యదర్శి విద్యావతి ఆధ్వర్యంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నవారి కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెల్ప్‌డెస్క్ కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. 2020వ సంవత్సరంలో మండల వ్యాప్తంగా 10.200మంది ఎల్‌ఆర్‌ఎస్‌కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఫోన్లు చేసి పథకం వివరాలు వెల్లడించారన్నారు. మండలంలోని పాపిరెడ్డిగూడలో 5580దరఖాస్తులు వచ్చాయని, సంగెంలో 1760, ఇప్పలపల్లిలో 1000, కేశంపేట 450, అల్వాలలో 127, ఎక్లాస్‌ఖాన్‌పేటలో 127, వేముల్‌నర్వలో 146 దరఖాస్తులు రాగా, మండలంలోని మిగతా గ్రామాల్లో కలిపి 1010దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 31వరకు ప్రభుత్వానికి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందని, ఇరిగేషన్, రెవెన్యూశాఖల ద్వారా పరిశీలన చేసిన అనంతరం ఎల్‌ఆర్‌ఎస్‌ను క్రమబద్ధీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కిష్టయ్యతోపాటు గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

కేశంపేట, మార్చి 8: మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పగిడిపాల సత్యనారాయణ(70) మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ శనివారం అల్వాలకు వెళ్లి సత్యనారాయణ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుమారుడు రాజును ఓదార్చారు. అనంతరం తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీలతశ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షులు రాజు, నాయకులు సుధాకర్, శంకరయ్య, నర్సింహ, మహేందర్, శంకర్, శేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

**టంగటూరులోని మువీ షూటింగ్ స్పాట్‌లో ఘటన**



శంభారెడ్డి (ఫైల్)

చేవెళ్ల రూరల్, మార్చి 8 : సినిమా షూటింగ్ స్పాట్‌లో కరెంట్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన శంకర్‌పల్లి మండల పరిధి మోకిలా స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. మోకిలా ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండల పరిధి టంగటూరు గ్రామంలో ఓ సినిమా షూటింగ్ నిర్వహిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన శంకర్‌పల్లి మాజీ ఏఎంసీ డైరెక్టర్ బద్దం శంభారెడ్డి (50) షూటింగ్ స్పాట్‌కు వెళ్లాడు. దీంతో అక్కడున్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించి పోస్టుమార్టం నిమిత్తం కుటుంబ సభ్యులకు అందజేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు తెలిపారు.

**మోకిలా చౌరస్తాలో ఆందోళన..**

శంభారెడ్డి మృతిపై కుటుంబ సభ్యులు, పలువురు గ్రామస్తులు మోకిలా చౌరస్తాలో ఆందోళన చేపట్టడంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు కలుగజేసుకొని బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని సినిమా డైరెక్టర్‌ను కోరగా వారు సానుకూలంగా స్పందించి రూ.34 లక్షల అందజేశారు. దీంతో ఆందోళన విరమించారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి..

మొయినాబాద్, మార్చి 8: స్నేహితుడి పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలుకూరు గ్రామానికి చెందిన ఇడిగి వెంకటేష్‌గౌడ్ కుటుంబం చిలుకూరు రెవెన్యూలో పరిధిలోని డైమాండ్ సిటీ కాలనీలో నివాసం ఉంటున్నది. వెంకటేష్ కుమారుడు శ్రీకాంత్ గౌడ్(19) శుక్రవారం రాత్రి హిమాయత్‌నగర్‌లో తన స్నేహితుడి వివాహానికి వెళ్లి తిరిగి శనివారం తెల్లవారు జామున ఇంటికి వస్తున్నాడు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం అయ్యింది. హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన అతడి స్నేహితుడు గణేష్ బాధిత తండ్రి వెంకటేష్‌గౌడ్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకుని పరిశిలించగా, తన కుమారుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## పంటచేనుకు చీరలే రక్షణ

కొందుర్గు, మార్చి 8: రైతులు సాగు చేసిన పంటలను అడవి పందుల బారినుంచి కాపాడుకునేందుకు రైతులు పంటచేనుకు చీరలను రక్షణకవచంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. మండలంలో మొక్కజొన్న, వేరుశనగ, టమాట, మిర్చి, జొన్న, వరి పంటలను సాగు చేసిన రైతులకు అడవి పందుల బెడద ఎక్కువవుతుంది. రాత్రి సమయాల్లో పంటలను ధ్వంసం చేస్తున్నాయని, దీంతో చేసేదిలేక ప్రత్యామ్నాయంగా చీరలను రక్షణ కవచంగా పంట చుట్టూ ఏర్పాటు చేసుకున్నట్లు రైతులు చెబుతున్నారు.



# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**
**ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం**
**కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్న మహిళా ప్రతినిధులు**
**పలువురిని సన్మానించిన వివిధ పార్టీల నేతలు**



ఆమనగల్లులో మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు, మార్చి 8: మహిళలు సృష్టికి మూలమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో బీఆర్‌ఎస్ పార్టీ మాజీ జడ్పీటీసీ నేనావత్ అనురాధ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ రాధమ్మ, మాజీ ఏఎంసీ డైరెక్టర్లు సుభాశ్, రమేశ్‌నాయక్, నాయకులు సయ్యద్ ఖలీల్, రఘు, కమఠం వెంకటయ్య, పంతునాయక్, నాయకులు ప్రసాద్, కిరణ్, సతీశ్, శివకుమార్, సైదుల్‌గౌడ్, రమేశ్‌నాయక్, యాదయ్య, వెంకటేశ్, గణేశ్, జగన్, శివ ఉన్నారు.

**యాచారంలో..**

యాచారం : మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన మహిళా పంచాయతీ కార్మికులను హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీస్ సీఐ కృష్ణంరాజు ఘనంగా సన్మానించారు. యాచారంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మహిళలు కేకు కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. అదే విధంగా మండల కేంద్రంలో ఐద్వా సంఘం జిల్లా నాయకురాలు అరుణ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తేజంరెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**పారిశుధ్య కార్మికులకు సన్మానం**

పెద్దఅంబర్‌పేట : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పెద్దఅంబర్‌పేటలోని ఐదోవార్డులో మాజీ కౌన్సిలర్ అనురాధ ఆధ్వర్యంలో మహిళా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. చీరలు అందజేసి శాలువాలతో సత్కరించారు. అదే విధంగా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని అబ్దుల్లాపూర్‌మెట్ ఎస్‌హెచ్‌వో అంజిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సైలు కర్ణాకర్‌రెడ్డి, మాధవ్, బద్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్‌రూరల్ :** ఫరూఖ్‌నగర్ మండలంలోని దూసకల్ గ్రామంలో హెరిటేజ్ నందిగామ పాల శీతలీకరణ కేంద్రం ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అశోక్, చంద్రమ్మ, రవీందర్ పాల్గొన్నారు.

**చేవెళ్లటౌన్ :** చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరోజు, బ్రహ్మాచారి, జిల్లా అధ్యక్షుడు నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు సుగుణ, పద్మ, శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**అప్పారెడ్డిగూడలో..**

షాబాద్ : మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలతో కలిసి గ్రామ మాజీ సర్పంచ్ పూజిత కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.

**కొందుర్గులో..**

కొందుర్గు: కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో మహిళా దినోత్సవాలను జరుపుకొన్నారు. చౌదరిగూడలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పీసీ పద్మజ, సిస్టర్లు రాణి, యాదమ్మ, సీహెచ్ యాదమ్మలతోపాటు ఏఎన్‌ఎంలను సత్కరించారు. కార్యక్రమంలో బాబురావు, జబ్బార్, అన్వర్, శ్రీను, సురేష్, అంజయ్య, పకీరయ్య, రవి, అంజి, రమేశ్, రాములు, ప్రభాస్, మల్లేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.



యాచారం : తాటిపర్తి పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న సీఐ కృష్ణంరాజు



పెద్దఅంబర్‌పేట: మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్‌హెచ్‌వో అంజిరెడ్డి తదితరులు



కేశంపేట: చౌదరిగూడలో మహిళలను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



షాబాద్ : మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ సర్పంచ్



చేవెళ్లటౌన్: మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన ఉపాధ్యాయ సంఘం సభ్యులు



## ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం

మాడ్గుల, మార్చి8: మాడ్గుల మండల పరిధిలోని మాజీ వైస్ ఎంపీపీ, బీఆర్‌ఎస్ నాయకుడు కొర్ర శంకర్‌నాయక్ శనివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి, ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తమ కూతురు మార్చి 16న జరిగే వివాహానికి రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మంచాల, మార్చి 8: రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆరుట్ల పంచాయతీ అనుబంధ గ్రామమైన బుగ్గతండాలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నిధులు నుంచి మంజూరైన రూ.10లక్షలతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీరోడ్లు, ఎస్టీ కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్లేశ్, గ్రామస్తులు మోహన్‌నాయక్, శ్రీనివాస్, శ్రీకాంత్, లచ్చిరాం, చంద్రయ్య, కృష్ణ, గణేశ్, టోపాల్, నర్సింహ, జగన్, నవీన్, శివ పాల్గొన్నారు.

## మహిళలకు క్లాత్ బ్యాగ్‌ల అందజేత



తుర్కయాంజాల్, మార్చి 8 : మున్సిపాలిటీ చౌరస్తాలో పర్యావరణ వేత్త ఓరుగంటి యాదయ్య మహిళలకు క్లాత్ బ్యాగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తమ నిత్యావసరాల కోసం క్లాత్ బ్యాగ్‌లను ఉపయోగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో మహిళలు ముఖ్యపాత్ర పోషించాలని అన్నారు.



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప

## రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి

**జూనియర్ సివిల్ జడ్జి స్వరూప**

ఆమనగల్లు, మార్చి 8: రాజీయే రాజమార్గం అని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు జూనియర్ సివిల్ జడ్జీ కాటం స్వరూప ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్ శనివారంతో ముగిసింది. ఇందులో మొత్తం 126 కేసులు రాజీ అయినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు, న్యాయవాది ఆంజనేయులు, ఏపీపీ కార్తిక్ పాల్గొన్నారు.

**లోక్‌అదాలత్‌లో 970కేసులు పరిష్కారం**

చేవెళ్లటౌన్, మార్చి 8: రాజీ మార్గంలో కక్షిదారులు కేసులను పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ ఉపయోగపడుతుందని సీనియర్ సివిల్ జడ్జి దశరథరామయ్య, రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు అన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని చేవెళ్ల కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా ఎన్నో ఏండ్ల సమస్యలను సైతం పరిష్కరించుకోవచ్చున్నారు. ఒకసారి లోక్ అదాలత్‌లో కొట్టివేసిన కేసులను తిరిగి పై కోర్టులో అప్పీలు చేయడానికి వీలుండదన్నారు. ఇందులో మొత్తం 970కేసులు పరిష్కరించగా, రూ. 14లక్షల 28వేల 280 రూపాయల జరిమానా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఏఎస్‌ఐ చందర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

## లోయపల్లిలో పోలీస్ బందోబస్తు



లోయపల్లిలో సేవాలాల్ విగ్రహం తొలగించిన ప్రాంతంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

మంచాల, మార్చి 8: మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తుగా మంచాల సీఐ మధు ఆధ్వర్యంలో పోలీస్ పికటింగ్‌ను ఏర్పాటు చేశారు. లోయపల్లి గ్రామంలో 15 రోజుల క్రితం గిరిజన సంఘం ఆధ్వర్యంలోని గ్రంథాలయ భవన నిర్మాణ స్థలంలో సేవాలాల్ మహరాజ్ విగ్రహం ఏర్పాటు చేయడంతో ఉద్రిక్తత నెలకొన్నది. గౌడ సంఘం నాయకులు ప్రభుత్వ ప్రాథమిక ఉపకేంద్రం వద్ద సర్దార్‌పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ తల్లెత్తుతుందనే ఉద్దేశంతో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు గ్రామంలోని రెండు కులాలకు సంబంధించిన విగ్రహాలను గ్రామ పంచాయతీ సిబ్బందితో తొలగింపజేశారు. కాగా, ఆదివారం లోయపల్లి సమీపంలో జరుగనున్న జెండా పండుగ జాతర ఉత్సవాల రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు పికటింగ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



## ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

చేవెళ్ల రూరల్, మార్చి 8 : చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో 2009-10 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం ఆలూర్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘన సన్మానం

షాద్‌నగర్‌రూరల్, మార్చి 8: ఫరూఖ్‌నగర్ మండలంలోని చించోడ్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రసూల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం, సాంస్కృతి కార్యక్రమాలకు మండల విద్యాధికారి మనోహర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్, జిల్లా విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి కురమయ్య హాజరైన మాట్లాడారు. అనంతరం అంతార్జతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. అదేవిధంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.



## దీర్ఘకాలిక పంట రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

**డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా**



ఆమనగల్లు, మార్చి 8: వాన కాలంలో రూ.3 కోట్లకు పైగా దీర్ఘకాలిక పంటరుణాలను ఇవ్వనున్నట్లు డీసీసీబీ డైరెక్టర్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేష్‌గుప్తా తెలిపారు. శనివారం పాలకవర్గ గడువును ప్రభుత్వం ఆరు నెలలు పొడిగించిన నేపథ్యంలో సింగిల్ విండో కార్యాలయంలో పీఏసీఎస్ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంప వెంకటేష్ మాట్లాడుతూ రైతులు దీర్ఘకాలిక రుణాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తనాల కొరత తీర్చేందుకు ఆమనగల్లు, ముద్విన్, కడ్తాల్‌లో సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సొసైటీల ద్వారా కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సింగిల్‌విండో కార్యాలయంలో పనిచేస్తున్న మహిళలను సన్మానించారు. ఈ సమావేశంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, సభ్యులు జోగు వీరయ్య, వెంకటయ్య, వెంకటేశ్, డోల్యానాయక్, శ్రీపాల్, జంగమ్మ, చెన్నమ్మ, అరుణ, సేవ్యానాయక్, సీఈవో దేవేందర్, సిబ్బంది అల్లాజీ, పద్మాకర్ ఉన్నారు.

## ఆలయంలో మైసమ్మ, కనకదుర్గ విగ్రహాలు మాయం

**పోలీసులకు ఫిర్యాదు చేసిన హిందువులు**

మొయినాబాద్, మార్చి 8:ఆలయానికి ఉన్న టైల్స్ తొలగించడంతో పాటు ఆలయంలో ఉన్న విగ్రహాలను మాయం చేశారు. ఈ ఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ప్రభుత్వ దవాఖానలోనే మైసమ్మ, కనకదుర్గ అమ్మవార్ల విగ్రహాలతో ఒక ఆలయం ఉంది. దవాఖానలో విధులు నిర్వహిస్తున్న ఓ ఏఎన్‌ఎం మతిస్థితిమితం కోల్పోయి ఆలయానికి ఉన్న టైల్స్‌ను తొలగించుకుంటూ వస్తుంది. ఆమెకు పూనకం వచ్చినప్పుడల్లా ఆలయానికి టైల్స్ ఉండటం వలన అమ్మవార్లకు భారంగా ఉంటుందని చెబుతుండేది. టైల్స్ ఎందుకు తీస్తున్నావని ఎవరైనా అడుగుతే వాళ్లను తిట్టడం వంటి పనులు చేస్తుంది. దీంతో ఆలయం వద్ద ఆమె ఏమి చేసినా ఎవరు ఏమి అనేవారు కాదు. శనివారం రోజున ఆలయం వైపు కొందరు వెళ్లి చూసే సరికి ఆలయంలో విగ్రహాలు కనిపించకుండా మాయం చేశారు. విగ్రహాలను తొలగించారని సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొట్టడంతో బీజేపీ మండల అధ్యక్షుడు ఎం శ్రీకాంత్, హిందూ సంఘాల నాయకులు ఆలయం వద్దకు చేరుకున్నారు. దవాఖానలో ఉన్న తోటి సిబ్బంది, అధికారులను ప్రశ్నించారు. ఎవరు విగ్రహాలు తీసారు, ఎందుకు తీసారని నిలదీశారు. అక్కడ పని చేస్తున్న ఏఎన్‌ఎం తీసిందని చెప్పారు. ఆమె మతిస్థిమితం కోల్పోయిందని పేర్కొన్నారు. దీనిని ఖండిస్తూ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**మానసికంగా ఇబ్బంది పడుతుంది..**

ఏఎన్‌ఎంగా దవాఖానలో విధులు నిర్వహిస్తున్న ఆమె మానసికంగా చాలా ఇబ్బంది పడుతుందని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు అన్నపూర్ణ చెప్పారు. ఆలయం వద్ద పూజలు చేస్తుండేదని, గత ఇరవై రోజుల నుంచి ఆలయం వద్దనే ఉంటుందని, భోజనం కూడా చేయకుండా ఉంది. పిచ్చి పిచ్చి చేస్తుందని వెంటనే జిల్లా వైద్యాధికారికి కూడా సమాచారం ఇవ్వడంతో జిల్లా వైద్యాధికారి వచ్చి ఆమెతో మాట్లాడాడని, ఆరోగ్యం మంచిగా చూయించుకోమని సూచించాడు. ఇదే విషయాన్ని ఆమె కుమారుడు, తల్లి, అక్కకు కూడా సమాచారం ఇవ్వడంతో వాళ్లు కూడా వచ్చి తీసుకెళ్లడానికి ప్రయత్నించగా ఆమె రాకపోవడంతో వదిలేసి వెళ్లారు. ఆమెను దవాఖానకు తీసుకెళ్లడానికి దగ్గరకు వెళ్లితే కర్రలతో వారిని కొట్టడానికి వెళ్లిందని, దీంతో పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

## అక్రమంగా మట్టి తరలింపు.. కేసు నమోదు

కేశంపేట, మార్చి 8: అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను కేశంపేట పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం ఫరూఖ్‌నగర్ మండలంలోని బుచ్చిగూడ నుంచి మహేశ్వరం మండలం దుబ్బచర్లకు మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్లల్లో తరలిస్తున్నారన్నారు. ఉదయం 4:30గంటల సమయంలో పెట్రోలింగ్‌లో ఉన్న కేశంపేట పోలీసులు మండల పరిధిలోని మంగలిగూడ గ్రామం వద్ద మట్టిని తరలిస్తున్న టిప్పర్లను గుర్తించారని, ఈ మేరకు వాహనాలను నిలిపి డ్రైవర్లను విచారించగా ఎలాంటి అనుమతులు లేవని తెలిపారన్నారు. టిప్పర్లను స్వాధీనం చేసుకొని కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

**చికిత్స పొందుతూ**

## వృద్ధురాలి మృతి



రబియాబీ(ఫైల్)

కేశంపేట, మార్చి 8: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండల పరిధిలోని పెద్దపులినాగారం గ్రామానికి చెందిన సయ్యద్ రబియాబీ (80) కేశంపేట మండలం భైర్ఖాన్‌పల్లి శివారులోని తన వ్యవసాయ పొలంలోని ఆకుకూరలను శంషాబాద్ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుండేది. రోజుమాదిరిగానే సాయంత్రం పనులు ముగించుకొని గ్రామానికి వెళదామని బస్సుకోసం ఎదురు చూస్తున్నది. అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ తన కారుతో రబియాబీని ఢీకొట్టాడన్నారు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను శంషాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి అల్లుడు షేక్ అహ్మద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. మద్యం మత్తులో ఎవరైనా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.